ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంచిర్యాల జిల్లా వార్తలు
5
మంగళవారం 25 జూన్ 2024



నేడు రైతులతో మంత్రి సమావేశం

చెన్నూరు, జూన్ 24: కిష్టంపేట రైతు వేదికలో మంగళవారం ఉదయం 9 గంటలకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తామని ఏఈవో సాగర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతు భరోసా మార్గదర్శకాలు ఏ విధంగా చేస్తే ఉపయోగకరంగా ఉంటుంది తదితర విషయాలపై సమావేశం ఉంటుందన్నారు. రైతులందరు సకాలంలో హాజరు కావాలని కోరారు.

మెగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయాలి



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న డీఎస్సీ అభ్యర్థులు

బెల్లంపల్లి, జూన్ 24 : ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా రాష్ట్ర ప్రభుత్వం 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని సోమవారం బెల్లంపల్లిలోని గ్రంథాలయం ఎదుట డీఎస్సీ అభ్యర్థులు ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఎన్నికల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీని ప్రకటిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఎంతో మంది నిరుద్యోగులు నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నారని వాపోయారు. ఇటీవల టీచర్ల బదిలీలు చేపట్టిన ప్రభుత్వం ప్రమోషన్‌ల ద్వారా ఏర్పడిన ఖాళీలను డీఎస్సీలో కలపాలని డిమాండ్ చేశారు. ఇప్ప రాజేంద్ర ప్రసాద్, పురంశెట్టి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు



బస్సు డ్రైవర్లతో మాట్లాడుతున్న ఎస్సై రాజశేఖర్

మందమర్రి టౌన్, జూన్ 24: స్కూల్ బస్సులు ఫిట్‌నెస్‌గా ఉండాలని ఎస్సై రాజశేఖర్ తెలిపారు. సోమవారం ప్రైవేటు పాఠశాలల బస్సు డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు బస్సు కండీషన్ సరిగా లేకపోతే యాజమాన్యానికి తెలియజేయాలన్నారు. లైసెన్సు ఉండాలని, యూనిఫాం ధరించాలన్నారు. అటెండర్ లేకుండ బస్సులు నడుపవద్దని, ధ్రువీకరణ పత్రాలు లేకుండా బస్సులను నడిపితే నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందన్నారు.

ప్రతీ ఒక్కరు పర్యావరణాన్ని కాపాడాలి



పర్యావరణ పరిరక్షణ ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 24 : పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు పాటుపడాలని కార్మెల్ కాన్వెంట్ హైస్కూల్ ప్రిన్సిపాల్ రేసమ్మ పేర్కొన్నారు. సోమవారం కార్మెల్ పాఠశాలలో విత్తనబంతులు (సీడ్‌బాల్), పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. విద్యార్థులతో విత్తన బంతులు తయారు చేయించి పాఠశాల ఆవరణలో విసిరారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడడం అందరి బాధ్యత అని తెలిపారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులకు పర్యావరణంపై అవగాహన కల్పించాలన్నారు. కాలుష్య నివారణకు చెట్లు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. మొక్కలు నాటడం ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలన్నారు. విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై ప్రదర్శించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ఎన్‌హెచ్ కార్యాలయం ఎదుట బాధితుల ధర్నా



ఎన్‌హెచ్ పీడీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

ఏసీసీ, జూన్ 24: నేషనల్ హైవే 63 బాధిత రైతులు సోమవారం జిల్లా కేంద్రంలోని నేషనల్ హైవే అథారిటీ ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం పీడీకి వినతిపత్రం అందించారు. బాధిత రైతులతో కలిసి బీజేపీ నాయకుడు తుల మధుసూదన్‌రావు మాట్లాడుతూ నేషనల్ హైవే 63 అలైన్‌మెంట్‌ను మూడుసార్లు మార్చారన్నారు. మూడోసారి మార్చిన అలైన్‌మెంట్ పంట భూముల్లో నుంచి వెళ్తుందని, రైతులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. గతంలో ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణానికి భూములు కోల్పోయిన వారికి మిగిలిన భూముల్లో నుంచి ఎన్‌హెచ్ 63ని విస్తరించాలని ప్రతిపాదించడం సుప్రీంకోర్టు తీర్పుకు విరుద్ధమన్నారు. ప్రస్తుతం ఉన్న హైవేను విస్తరిస్తే భూసేకరణ అవసరం ఉండదని, ఎవరికి నష్టం జరగదన్నారు. రైతులు లగిశెట్టి రాజమౌళి, జనార్ధన్‌రెడ్డి, తిరుపతి, మల్లేష్, నాయకులు బోస్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్‌లో సిల్వర్ మెడల్



సిల్వర్ మెడల్ సాధించిన మహతి

ఏసీసీ, జూన్ 24 : రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్‌లో జిల్లా కేంద్రానికి చెందిన వెరబెల్లి మహతి రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించారు. ఆదివారం రాత్రి హైద్రాబాద్‌లోని గచ్చిబౌలిలో జరిగిన 10 మీటర్ల రైఫిల్ షూటింగ్ జూనియర్ విభాగం, జూనియర్ మహిళ విభాగం రెండింటిలో ప్రతిభ కనబర్చారు. మాజీ డీజీపీ అంజనికుమార్ చేతుల మీదుగా మెడల్స్ అందుకున్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌కు భూమి అప్పగింత

భీమారం, జూన్ 24 : భీమారం 33కేవీ సబ్ స్టేషన్‌కు సంబంధించిన భూమిని మండల సర్వేయర్ నాగరాజు సోమవారం విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాస్, చెన్నూరు ఏడీ రవికుమార్, భీమారం ఏఈ కుమారస్వామిలకు అప్పగించారు. త్వరలోనే టెండరు ప్రక్రియ ప్రారంభిస్తున్న ఎస్ఈ తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ భుక్యా తిరుమలలక్ష్మణ్, ఎంపీటీసీ పెద్దల రూపబాపు, మాజీ సర్పంచు మల్లేష్, కాంగ్రెస్ నాయకులు నరేష్, లైన్‌మెన్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రైళ్ల రద్దుతో ప్రయాణికుల అవస్థలు



- ఆరు నెలలుగా రాకపోకల్లో అంతరాయం
- దశాబ్దాలుగా లేని నూతన రైళ్ల కేటాయింపు
- పార్లమెంట్ సమావేశాల్లో ఎంపీ ప్రస్తావిస్తారా

మంచిర్యాల, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల-కాజీపేట-సిర్పూర్ కాగజ్‌నగర్ మధ్య కొద్ది రోజులుగా రైళ్ల రాకపోకలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాగజ్‌నగర్ నుంచి బెల్లంపల్లి వరకు జరుగుతున్న మూడో రైల్వే మార్గం పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ కారణంగా తరుచుగా రైళ్లను రద్దు చేస్తున్నారు. పాఠశాలలు, కళాశాలలు ప్రారంభం కావడంతో విద్యార్థులు హైద్రాబాద్‌కు వెళ్లాలంటే ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తోంది. రైళ్లు అందుబాటులో లేకపోవడంతో బస్సులు, ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. దీంతో ఆర్థిక భారం పడుతోంది.



మంచిర్యాల రైల్వే స్టేషన్

అందుబాటులో రెండే రైళ్లు

మంచిర్యాల రైల్వేస్టేషన్ నుంచి నిత్యం సుమారు 6వేల మంది ప్రయాణికులు పలు ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. వీరిలో అత్యధికంగా రాష్ట్ర రాజధాని హైద్రాబాద్‌కు వెళుతారు. నిత్యం ఈ మార్గంలో మూడు రైళ్లు మాత్రమే ప్రయాణికులకు అందుబాటులో ఉన్నాయి. రెగ్యులర్‌గా నడిచే భాగ్యనగర్ రైలు కొద్ది రోజులుగా రద్దుకావడంతో మధ్యాహ్నం ఇంటర్‌సిటీ, అనంతరం 3.30కి కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ రెండు రైళ్లు మాత్రమే ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి కొత్తగూడెం వెళ్లే సింగరేణి, కరీంనగర్‌కు వెళ్లే పుష్పుల్, కాజి పేటకు వెళ్లే రామగిరి రైళ్లను రద్దు చేశారు. వీటిని తిరిగి పునరుద్ధరించాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

కొత్త రైళ్ల ఊసేది ?

సికింద్రాబాద్ సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి కాజీపేట-వరంగల్, సికింద్రాబాద్-విజయవాడ మార్గంలో దశాబ్దాలుగా కొత్త రైళ్ల కేటాయింపులు లేక ఈ ప్రాంతానికి అన్యాయం జరుగుతోంది. సికింద్రాబాద్‌కు వెళ్లేందుకు ఉదయం 5 గంటలకు భాగ్యనగర్ రైలు తరువాత మధ్యాహ్నం ఒంటి గంటకు ఇంటర్‌సిటీ వరకు మధ్యలో ఎలాంటి ట్రైన్ అందుబాటులో లేవు. పదేళ్లుగా కొత్త రైళ్లు ఈ మార్గంలో కేటాయించలేదు. ఉదయం 8 గంటలకు కాగజ్‌నగర్ నుంచి కరీంనగర్, సాయంత్రం 5 గంటలకు కరీంనగర్ నుంచి కాగజ్‌నగర్‌కు రైలు సౌకర్యం కల్పిస్తే ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉంటుంది.

ఎంపీ గళం విప్పేనా

లోక్‌సభ ఎన్నికల అనంతరం మొదటిసారిగా పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. సోమ, మంగళవారాల్లో ఎంపీల ప్రమాణ స్వీకారం, 26న స్పీకర్ ఎన్నిక జరగనుంది. అనంతరం సమావేశాలు ప్రారంభమై వచ్చేనెల 3 వరకు జరుగనున్నాయి. పెద్దపల్లి ఎంపీగా గెలిచిన గడ్డం వంశీకృష్ణ సమస్యలపై గళం విప్పుతారని ప్రజలు ఆశిస్తున్నారు. పార్లమెంటు సమావేశాలు జరుగుతున్నందున రైళ్ల సమస్యలను పరిష్కరించాలనే విజ్ఞప్తులు వినిపిస్తున్నాయి.

ప్రజావాణిలో సమస్యల వెల్లువ

కలెక్టరేట్‌కు తరలివచ్చిన బాధితులు



బెల్లంపల్లి మున్సిపల్ పట్టణ ప్రగతి కార్మికుల ర్యాలీ, కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న మందమర్రి జేఏసీ నాయకులు

నస్పూర్, జూన్ 24: జిల్లాలోని మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనాలు, ఎగ్స్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అంతకు ముందు చౌరస్తా నుంచి కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అదనపు కలెక్టర్‌కు అందించారు. నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలన్నారు. కార్మికులకు గౌరవ వేతనం, విద్యార్థులకిచ్చే మెనూ చార్జీలు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని, గ్యాస్ సబ్సిడీ ఇవ్వాలని, ఎగ్స్‌కు అదనంగా బడ్జెట్‌లో కేటాయించాలన్నారు. ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు దాసరి రాజేశ్వరి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రంజిత్‌కుమార్, నాయకులు రవి, లక్ష్మన్, లక్ష్మి, కళావతి, వసంత, గట్టక్క, అనసూయ, బానమ్మ, స్వాతి పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల ధర్నా

బెల్లంపల్లి నర్సరీలో పనిచేసిన మహిళా కార్మికులను తొలగించడాన్ని నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కార్మికులు జాతీయ రహదారి నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. తమను విధుల్లోకి తీసుకోవాలని మున్సిపల్ పట్టణ ప్రగతి యూనియన్ నాయకులు డిమాండ్ చేస్తూ అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం మాట్లాడుతూ 15 మంది మహిళా కార్మికులు ఐదేళ్ల నుంచి నర్సరీలో పని చేస్తున్నారన్నారు. డిసెంబరు, జనవరి నెలల వేతనాలు చెల్లించకుండా తొలగించారన్నారు. ఇతరులకు అవకాశం ఇచ్చి పనులు చేయించుకుంటున్నారన్నారు. తమకు న్యాయం చేయాలని మహిళా కార్మికులు విన్నవించారు. లావణ్య, లత, రాధ, రామక్క, గంగా, శారద, నీల, రేణుక, పాల్గొన్నారు.

మందమర్రికి ఎన్నికలు నిర్వహించాలి

మందమర్రి మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించాలని కలెక్టరేట్ ఎదుట మందమర్రి ఎన్నికల సాధన (జేఏసీ) ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసి కలెక్టర్ కుమార్‌దీపక్‌కు వినతిపత్రం అందించారు. నాయకులు మాట్లాడుతూ మందమర్రిలో పాలకవర్గం లేకపోవడంతో సమస్యలు పేరుకుపోయి పాలన అస్తవ్యస్తంగా మారిందన్నారు. త్వరగా ఎన్నికలు నిర్వహించే విధంగా చర్యలు చేపట్టాలని విన్నవించారు. జేఏసీ సభ్యులు గుడికందుల రమేష్, మేసినేని అరణ్, కస్తూరి శ్రీనాథ్, ముజాహిద్, భీంసేన్, మేడారపు శేఖర్, సోనాల్ శర్మ, రాకేష్, పాల్గొన్నారు.

వార్డు సమస్యలు పరిష్కరించాలి

బెల్లంపల్లి: పట్టణంలోని కాంట్రాక్టర్ బస్తీ సమస్యలను పరిష్కరించాలని అదనపు కలెక్టర్ రాహుల్‌కు వార్డు ప్రజలు వినతిపత్రం అందించారు. వార్డులో సీసీ రోడ్లు, మురికి కాలువలు లేకపోవడంతో వర్షం కురిసినప్పుడు ఇండ్లలోకి నీరు చేరుతుందని తెలిపారు. ఇండ్లకు దగ్గరగా వైన్‌షాపు ఉండడంతో మహిళలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. కాంట్రాక్టర్ బస్తీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

వేమనపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీవో శ్రీపతి బాపురావు ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు సమస్యలుంటే ప్రజావాణిలో దరఖాస్తు అందజేస్తే పరిష్కరిస్తామన్నారు. తహసీల్దార్ రమేష్, ఏపీవో సత్యప్రసాద్, ఏపీఎం ఉమారాణి, ఐసీడీఎస్‌సూపర్‌వైజర్ సువర్ణ, సుజాత పాల్గొన్నారు.

కాలువలకు మరమ్మతు చేయించాలి

మందమర్రిరూరల్(కాసిపేట): కాలువలకు మరమ్మతు చేపట్టాలని కాసిపేట ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో ఎంపీడీవోకు పెద్దాపూర్ రైతులు వినతిపత్రం అందించారు. దేవాపూర్ పంచాయతీ పరిధిలోని పెద్దాపూర్ శివారులో 40 ఏండ్ల క్రితం నిర్మించిన చెరువు కుడి ఎడమ కాలువలకు మరమ్మతు లేకపోవడంతో పొలాలకు నీరందడం లేదన్నారు. మరమ్మతు చేయించాలని కోరారు.

సదరం సర్టిఫికెట్లు ఇవ్వాలి

మంచిర్యాల అర్బన్, జూన్ 24: తలసేమియా, సికిల్‌సెల్, హిమోఫోలియా వ్యాధిగ్రస్తులను దివ్యాంగులుగా గుర్తించి సదరం సర్టిఫికెట్లు ఇవ్వాలని తలసేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కాసర్ల రంజిత్‌కుమార్ కోరారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. రంజిత్‌కుమార్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోకపోగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తుందన్నారు. తమకు న్యాయం చేయాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 24: ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించేందుకు సంబంధిత అధికారుల సమన్వయంతో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్‌లు రాహుల్, మోతిలాల్, ఆర్డీవోలు రాములు, హరికృష్ణలతో కలిసి ఆర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మంచిర్యాల, బెల్లంపల్లి, దండేపల్లి, హాజీపూర్, కాసిపేట తదితర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు దరఖాస్తులు అందించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో 50 దరఖాస్తులు అందాయని, ప్రతి దరఖాస్తును పరిశీలించి సంబంధిత అధికారుల సమన్వయంతో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

గాయపడిన పాము.. ఆస్పత్రిలో చికిత్స

అనంతరం సురక్షితంగా అటవీ ప్రాంతానికి



నాగుపాముకు చికిత్స చేస్తున్న పశువైద్యాధికారి



పామును అడవిలో వదిలివేస్తున్న పోలయ్య

బెల్లంపల్లి, జూన్ 24: ట్రాక్టర్‌తో పొలం చదును చేస్తుండగా ట్రాక్టర్ టైరు కింద పడి గాయపడిన నాగుపాము ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించిన అరుదైన ఘటన బెల్లంపల్లిలో చోటుచేసుకుంది. బెల్లంపల్లి మండలం కాశిరెడ్డిపల్లి గ్రామంలో ఓ రైతు సోమవారం ట్రాక్టర్‌తో పొలాన్ని చదును చేస్తున్నాడు. ట్రాక్టర్ టైర్ నాగుపాముపై నుంచి వెళ్లడంతో పాముకు గాయమైంది. దీంతో పాము కదలలేని స్థితిలో కొట్టుమిట్టాడింది. గమనించిన డ్రైవర్ పాములు పట్టే పోలయ్య అనే వ్యక్తికి సమాచారం అందించాడు. పోలయ్య సంఘటనా స్థలానికి చేరుకుని పామును బెల్లంపల్లి పశువైద్య కేంద్రానికి తీసుకువచ్చాడు. పశువైద్యాధికారి దిలీప్ పాముకు మత్తు ఇంజక్షన్‌కు ఇచ్చి గాయమైన చోట కుట్లు వేశారు. అనంతరం పోలయ్య పామును సమీప అటవీ ప్రాంతంలో వదిలివేశాడు. గాయపడిన పాము సుమారు ఐదు అడుగుల పొడవు ఉంది. పాము కనిపిస్తే ఎవరైనా కొట్టి చంపాలని చూస్తారు కానీ, ఇలా గాయపడిన పాముకి చికిత్స చేయించడం అరుదైన సంఘటనగా స్థానికులు చర్చించుకుంటున్నారు.

వీధి కుక్కను చంపిన వ్యక్తిపై కేసు

నస్పూర్, జూన్ 24: సీసీసీ కార్నర్ సమీపంలోని గాయత్రినగర్‌లో వీధి కుక్కను పొడిచి చంపిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పందులను చంపుతుందనే కారణంతో ఈ నెల 22న గాయత్రినగర్‌లో ఓ వ్యక్తి వీధి కుక్కను కత్తితో పొడవడంతో చనిపోయింది. ఈ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు కావడంతో దాని ఆధారంగా చంపిన వ్యక్తి సమ్మయ్యగా స్థానికులు గుర్తించారు. సోమవారం స్ట్రే యానిమల్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌జీవో) కార్యకర్త అదులాపురం గౌతమ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశాడు. గౌతమ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు.

ఎన్‌టీఏను ప్రక్షాళన చేయాలి

ఏసీసీ, జూన్ 24 : నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని ప్రక్షాళన చేయాలని జాతీయ విద్యార్థి సమాఖ్య నాయకుడు చేరాల వంశీ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ నీట్ పరీక్షల్లో నెలకొన్న అవకతవకలపై సీబీఐ ద్వారా విచారణ జరిపి బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. పేపరు లీకేజీకి అధికారులను తొలగించాలనిడిమాండ్ చేశారు.

టీపీసీసీ లీగల్ సెల్ వైస్‌చైర్మన్‌గా తిరుపతివర్మ



దండేపల్లి, జూన్ 24: టీపీసీసీ కాంగ్రెస్ లీగల్ సెల్ వైస్‌చైర్మన్‌గా వెల్గనూర్ గ్రామానికి చెందిన అక్కల తిరుపతివర్మ ఎన్నికయ్యారు. లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ తిరుపతి వర్మను వైస్ చైర్మన్‌గా నియమించి నియమాకపత్రాన్ని సోమవారం అందజేశారు. గతంలో తెలంగాణ జాగృతి రాష్ట్ర లీగల్‌సెల్ కన్వీనర్‌గా పని చేశారు. ఇటీవలే మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాష్ట్రంలో సబ్బండ వర్గాలకు కాంగ్రెస్ పార్టీ అభయహస్తం ఎంతో తోడ్పాడు చేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి తన శక్తివంచన లేకుండా పని చేస్తానని తిరుపతి వర్మ పేర్కొన్నారు.

నైనీ ప్రాజెక్ట్‌కు పూర్తి సహకారం



ఒడిశా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో బలరాం

మంచిర్యాల, జూన్ 24(ఆంధ్రజ్యోతి): సింగరేణి నైనీ ప్రాజెక్టుకు పూర్తి సహకారం అందిస్తామని ఒడిశా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా అన్నారు. ఆయనతో పాటు ఒడిశా రాష్ట్ర పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పీసీసీ ఎస్తోనూతో సింగరేణి సీఎండి బలరాం సోమవారం భేటీ అయ్యారు. ఒడిశా అధికారులు మాట్లాడుతూ, నైనీ ప్రాజెక్టుకు అవసరమైన అటవీ స్థలాన్ని వీలైనంత త్వరగా అప్పగించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. సమీపంలో నిర్మించతలపెట్టిన థర్మల్ పవర్ ప్లాంట్‌కు అనువైన స్థలం గుర్తిస్తామన్నారు. అనంతరం సీఎండీ ఒడిశా ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఇడ్కో) చైర్మన్ హేమంత్ శర్మను కలిశారు. వన్యప్రాణి సంరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం కోరినట్లుగా రూ.39 కోట్లు రాష్ట్ర ప్రభుత్వానికి జమ చేశామని, ఇప్పటి వరకు వివిధ రూపాల్లో రూ.180 కోట్లు పూర్తిగా చెల్లించామని సీఎండీ వివరించారు. నైనీకి 50 కిలోమీటర్ల దూరంలోనే 1600 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. దీనికి 800 ఎకరాల స్థలం అవసరం ఉంటుందని ప్రభుత్వం నుంచి సహకారం కావాలని కోరారు. అనంతరం ఇడ్కో సీజీఎం సరోజ్ కుమార్ సేథీతో మాట్లాడారు. అనంతరం ఒడిశా ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ సుశాంత్ నందాను సీఎండి కలిసి అటవీ భూమిని బదలాయించాలని కోరారు. సింగరేణి సీఎండి బలరాం మాట్లాడుతూ మూడు నెలల్లో భూమి బదలాయింపు, బొగ్గు ఉత్పత్తి ప్రారంభమవుతుందన్నారు. ఒడిశాలో థర్మల్ పవర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తే సింగరేణికి ఆర్థికంగా ఉపయోగపడుతుందని చెప్పారు. సీఎండీతోపాటు నైనీ జీఎం తుమ్మలపల్లి శ్రీనివాసరావు, జీఎం(ఎస్టేట్స్) బండి వెంకటయ్య, చీఫ్ ఆఫ్ పవర్ ప్రాజెక్ట్స్ విశ్వనాథరాజు, ప్రాజెక్ట్ అధికారి ఎస్. మజుందార్, ఎస్ఈ (మైనింగ్) ప్రవీణ్ కశ్యప్, తదితరులు ఉన్నారు.

మహిళ శక్తి క్యాంటీన్‌లపై అవగాహన

మందమర్రిరూరల్, జూన్ 24: మహిళశక్తిక్యాంటీన్‌లపై సోమవారం మండల ఐకేపీ కార్యాలయంలో పొదుపుసంఘాల వీవోఏలకు అవగాహన కల్పించారు. ఎంపీడీవో రాజేశ్వర్ మాట్లాడుతూ మహిళక్యాంటీన్‌లను ప్రభు త్వం పూర్తిగా పొదుపుసంఘాలకే కట్టబెడుతుందని వాటిని సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నారు. ఇతర యూనిట్‌లను కూడా మహిళ సంఘాలకు కేటాయించే అవకాశాలున్నాయని తెలిపారు.

చిన్న సంఘాలను బలోపేతం చేయాలి

భీమిని, జూన్ 24: గ్రామైఖ్యసంఘాలను బలోపేతం చేయాలని ఐకేపీ ఏపీఎం పంజాలప్రకాష్‌గౌడ్ సూచించారు. సోమవారం మండలకేంద్రంలో భారత మాతా మండలసమాఖ్య కార్యాలయంలోమండల సమాఖ్యసమావేశాన్ని నిర్వహించారు. గ్రామాల్లో చిన్నసంఘాలను బలోపేతంచేసి, ప్రతీనెల సమావేశాలునిర్వహించాలన్నారు.రుణాలు సక్రమంగాచెల్లించేలాచర్యలు చేపటాలన్నారు.

నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి

జన్నారం, జూన్ 24 : రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు విక్రయించాలని డీఏవో సురేఖ అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని ఫెర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. స్టాకునిల్వలు, రిజిష్టర్‌లు, విత్తన ప్యాకెట్లను పరిశీలించారు. ఆమెమాట్లాడుతూ ఫెర్టిలైజర్ దుకాణదారులు రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విత్తనాలు, ఎరువులు అందించాలన్నారు. రైతులుకొన్నవాటికి రశీదులు ఇవ్వాలన్నారు.

ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య

దండేపల్లి, జూన్ 24: ప్రైవేటు కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నామని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శోభ అన్నారు. ప్రభుత్వంనుంచి సరఫరా చేసిన ఉచిత పాఠ్యపుస్తకాలను సోమవారం విద్యార్థులకు అందజేశారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత రంగాల్లో స్థిరపడాలన్నారు.

సులభ్ కాంప్లెక్స్ కోసం స్థల పరిశీలన

వేమనపల్లి, జూన్ 24: స్వచ్ఛభారత్‌లో భాగంగా వేమనపల్లి గ్రామంలో సోమవారం కమ్యూనిటీ సులభ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ఎంపీవో శ్రీపతిబాపురావు స్థలాన్ని పరిశీలించారు. గ్రామానికివచ్చే వారి సౌకర్యార్థం సులభ్ కాంప్లెక్స్ నిర్మిస్తామని, ఇందుకోసం స్థలం పరిశీలించినట్లు తెలిపారు. అనంతరం గ్రామంలోని మరుగుదొడ్లు, ఇంకుడుగుంతల సర్వేను పరిశీలించిసూచనలు చేశారు. ఏపీవోసత్యప్రసాద్, ఏపీఎం ఉమారాణి, పంచాయతీ కార్యదర్శి, కారోబార్, గ్రూప్ సూపర్ వైజర్ ఉన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

ఆసిఫాబాద్ రూరల్, జూన్ 24: ఆసిఫాబాద్ బస్టాండు నుంచి పలు రూట్లలో బస్సులు నడిపించాలని సోమవారం గోర్‌సేనా నాయకులు డిపోమేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. మోవాడ, బల్లాన్‌పూర్, కెరమెరి, అనార్‌పల్లి, కొత్తపల్లికి బస్సుసౌకర్యం కల్పించాలని కోరారు. మహాలక్ష్మీస్కీం బెన్ఫిట్ గిరిజనగూడెం, తండాలలోనివసి స్తున్న ప్రజలకు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆసంఘం నాయులు రవీందర్, వినోద్, రాజేందర్, జితేందర్ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి

సిర్పూర్(యు), జూన్ 24: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని మహగాం స్కూల్‌కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు అనిత అన్నారు. సోమవారం మండలంలోని బండేయేర్ గిరిజన సంక్షేమ శాఖ ప్రాథమిక పాఠశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు పట్టికతోపాటు పాఠశాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు సులభంగాఅర్థంఅయ్యే విధంగా బోధన ఉండలన్నారు. మధ్యాహ్న భోజన పథకంను పరిశీలించారు.

ఇరువర్గాల ఫిర్యాదు

పెంచికలపేట, జూన్ 24: మండలంలోని దరోగపల్లి గ్రామంలో సోమవారం పోడురైతులకు అటవీఅధికారులకు మధ్య పోడు వివాదం రాజుకుంది. ఈక్రమంలో ఇరువర్గాలు స్థానిక పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేశాయి. అటవీశాఖ అధికారులు అక్రమంగా ఇంట్లోకి చొరబడి తన కుమారుడు సుధాకర్‌ను తీసుకెళ్లడానికి యత్నించి తనపై తన కుటుంబసభ్యులపై దాడిచేశారని డాంబారి అంజక్క అనేరైతుఫిర్యాదుచేయగా.. కొత్త పోడుసాగు చేస్తున్నాడని తెలియడంతో విచారణ నిమిత్తం కస్టడీలోకి తీసుకు రావడానికి వెళ్లగా వారే తమ విధులకు ఆటంకం కలిగించారని అటవీశాఖ అధికారులు ఫిర్యాదుచేశారు. ఈవిషయమై ఎస్సై కొమురయ్యను వివరణ కోరగాఇరువర్గాల ఫిర్యాదులు అందినమాట వాస్తవమేనని విచారణ జరుపుతున్నామని తెలిపారు.

నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

నస్పూర్, జూన్ 24: సమాజంలో జరుగుతున్న నేరాలపై ప్రజలు చైతన్యవంతులుగా ఉండాలని, నేరాల నివారణకు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైన ఉందని ఏసీపీ ప్రకాష్ అన్నారు. సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దొరగారిపల్లెలో సోమవారం రాత్రి సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణ, ఆత్మహత్యలు, లైంగిక వేధింపులు, గంజాయి వంటి సమాజాన్ని పట్టి పీడిచే వాటిపై ప్రజలను అవగాహన కల్పించడానికి కమ్యూనిటీ కాంటాక్టు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏసీపీ ప్రకాష్ ప్రజలకు వివిధ నేరాలు, సంఘటనలపై సూచనలు చేశారు. హెల్మెట్ వినియోగిస్తున్న యువకుడిని ఏసీపీ శాలువాతో సన్మానించారు. మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్, నస్పూర్ ఎస్సైలు రవి కుమార్, జితేందర్, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు హాజరైయ్యారు.

భూతగాదాలో ఐదుగురిపై కేసు నమోదు

నెన్నెల, జూన్ 24: మండలంలోని నందులపల్లిలో భూతగాదాలో గొడవపడిన జంబి పోషం, లచ్చన్న, బానక్క, జంబి చుక్కల, జంబి ప్రదీప్‌లపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. గ్రామ శివారులో కోర్టులో కేసు నడుస్తున్న భూమిలో ట్రాక్టర్‌తో దున్నకూడదని గంట అజయ్ వారించగా, అతడిపై ఐదుగురు దాడి చేశారని చెప్పారు. అజయ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

సెల్‌ఫోన్ అందజేత

బెల్లంపల్లి, జూన్ 24: పట్టణంలోని కన్నాల బైపాస్‌లో కాసర్ల యాదగిరి అనే వ్యక్తి సోమవారం ఫోన్ పోగొట్టుకోగా తాళ్లగురిజాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ గోపతి నరేష్ ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి సెల్‌ఫోన్‌ను గుర్తించి యాదగిరికి అందజేశారు. రెండు గంటల వ్యవధిలోనే ఫోన్‌ను గుర్తించి అందజేసిన పోలీసులకు యాదగిరి కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్‌జీటీల నిరసన



దండేపల్లిలో నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్‌జీటీలు

దండేపల్లి,జూన్ 24: ప్రమోషన్లలో ఎస్‌జీటీలకు జరిగిన అన్యాయంపై సోమవారం ప్రాథమిక పాఠశాలలో నిరసన తెలిపారు. 25ఏళ్ల పైబడి సర్వీసు పూర్తి చేసుకున్న ఎస్‌జీటిలకు ప్రమోషన్లు లభించలేదన్నారు. పండిట్లు, పీఈటీల ప్రమోషన్‌లో కామన్ సీనియార్టీ పాటించి సీనియర్ ఎస్‌జీటిలకు ప్రమోషన్ కల్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సుజాత, రంజిత్, సంపత్, కమలాకర్, శేషయ్య, పారిజాత, వందన, కవిత, మంజూల,సరిత, రమాదేవి, శ్రీలత, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సంకట హర చతుర్థి

నస్పూర్, జూన్ 24: హౌసింగ్ బోర్డు కాలనీలోని లక్ష్మిగణపతి ఆలయంలో మంగళవారం సంకట హర చతుర్థిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు రఘుపతి రావు, ప్రధానార్చకులు వంశీ కృష్ణ శర్మలు ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ 14వ వార్షికోత్సవం జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని వారు కోరారు.

లేబర్‌కార్డుపై అవగాహన కల్పించాలి

బెల్లంపల్లి, జూన్ 24 : పట్టణంలోని 2వ వార్డులో కూలీ పనులు చేసుకునే కార్మికులు అధికంగా ఉన్నందున వార్డులో లేబర్ కార్డుపై అవగాహన కల్పించాలని కౌన్సిలర్ అఫ్సర్ సోమవారం బెల్లంపల్లి సహాయ లేబర్ ఆఫీసర్‌కు వినతి పత్రం అందించారు. వార్డులో లేబర్ కార్డుపై అవగాహన కల్పిస్తే కూలీ పనులు చేసే వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.

చిరుజల్లులకే చిత్తడైన రోడ్డు

- పూర్తికాని చెన్నూర్-నీల్వాయి రోడ్డు
- అధ్వానంగా 4 కిలోమీటర్ల రహదారి

వేమనపల్లి, జూన్ 24: వర్షాకాలంలో ప్రారంభంలో చిరు జల్లులకే మండలంలోని నీల్వాయి రోడ్డు చిత్తడిగా మారింది. చెన్నూరు నుంచి నీల్వాయికి 4 కిలోమీటర్ల మేర రోడ్డు పనులు పూర్తి చేయకపోవడంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డుపై నీరు నిలిచిపోయి అధ్వాన్నంగా మారింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వేమనపల్లి మండలం నుంచి కోటపల్లి, చెన్నూరుకు వెళ్లే ప్రయాణికులు ఈ రోడ్డు గుండాను వెళ్లాల్సి ఉంటుంది. మిగితా రోడ్డంతా బాగున్నప్పటికీ నాలుగు కిలోమీటర్ల రోడ్డు అధ్వాన్నంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రెండు సంవత్సరాల క్రితం రోడ్డు పనులు ప్రారంభమైనప్పటికీ నీల్వాయి నుంచి కొత్తగూడెం వరకు 4 కిలోమీటర్లు పాత రోడ్డును తవ్వి వదిలేశారు. అప్పటి నుంచి కాంట్రాక్టర్ పనులు చేయకపోవడంతో రోడ్డు గుండా ప్రయాణికులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారు లు, ప్రజాప్రతినిధులు స్పందించి అసంపూర్తి రోడ్డును బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



నీల్వాయి సమీపంలో గుంతలమయమైన రోడ్డు

మిషన్ పరివర్తన కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలి

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 24: జిల్లాలో మాదకద్రవ్యాలు, గంజాయి, మత్తు పదార్థాలను నిరోధించడంలో భాగంగా మిషన్ పరివర్తన కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఏసీపీ ప్రకాష్, మద్యనిషేధ అధికారి నంద గోపాల్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ చందన, డీఈవో యాదయ్య, డీఎంహెచ్‌వో అనితలతో కలిసి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తు పదార్థాల నిర్మూలనకు కృషి చేయాలన్నారు. విద్యాసంస్థల్లో విద్యార్థులకు మత్తు పదార్థాలు, గంజాయి వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలన్నారు. అసాధారణ ప్రవర్తన కలిగిన విద్యార్థులను గుర్తించి కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. ఈ నెల 26న అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రరవాణా నిరోధక దినోత్సవం సందర్భంగా జిల్లాలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డీఈవో యాదయ్య, సంక్షేమాధికారి చిన్నయ్య, పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, డీఆర్‌డీవో కిషన్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గా ప్రసాద్, లీడ్ డిస్ట్రిక్ మేనేజర్ తిరుపతి, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

జిల్లా అదనపు కలెక్టర్ బదిలీ

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 24: మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)రాహుల్ బదిలీ అయ్యారు. భద్రాచలం ఐటీడీఏ పీవోగా బదిలీపై వెళ్లనున్నారు. జిల్లాలో లైబరీల ఇన్‌చార్జిగా నిరుద్యోగుల ఉద్యోగాల సాధనకు కృషి చేశారు. గ్రంథాలయాలను ఆధునీకరించి సౌకర్యాలు కల్పించారు.

చెరువు సర్వే ప్రారంభం

జన్నారం, జూన్ 24: కిష్టాపూర్ చెరువు కబ్జా గురైందని కిష్టాపూర్, కొత్తపల్లి, దేవునిగూడ, చర్లపల్లి గ్రామాల మత్స్యకారులు ఆదివారం చెరువు వద్ద ధర్నా నిర్వహించగా అధికారులు స్పందించారు. సోమవారం నీటి పారుదల శాఖ డిప్యూటీ ఈఈ వెంకటేశం ఆధ్వర్యంలో మండల సర్వేయర్ సురేష్ చెరువు సర్వేను ప్రారంభించారు. చెరువు భూమిని ఆక్రమించారనే ఆరోపణలతో ఎఫ్‌టీఎల్ లెవెల్ హద్దులు నిర్ణయించేందుకు సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. జేఈ రాజు, వర్క్ ఇన్‌స్పెక్టర్ శంకర్, సర్వేయర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

మందమర్రి టౌన్, జూన్ 24: కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఒకేసారి రుణ మాఫీకి శ్రీకారం చుట్టిందని అఖిల భారత యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు బండి సదానందం యాదవ్ తెలిపారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వాలు కూడా రైతుల సంక్షేమానికి కృషి చేసిన దాఖలాలు లేవన్నారు. పెద్దపల్లి ఎంపీగా వంశీకృష్ణ ప్రమాణ స్వీకారం సందర్భంగా మందమర్రిలో అన్నదాన కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు.

ఆర్థిక సహాయం

జన్నారం, జూన్ 24 : మండలానికి చెందిన గల్ఫ్ కార్మికుడు గద్దెల రాజన్న ఇటీవల మృతిచెందగా ఆయన కుటుంబానికి సోమవారం మరిమడుగు గల్ఫ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సతీష్ రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో వెంకటేష్, లాలయ్య, లచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పాలీసెట్ కౌన్సెలింగ్



బెల్లంపల్లి, జూన్ 24: పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలీసెట్ కౌన్సెలింగ్ కొనసాగుతోంది. మూడో రోజు సోమవారం 233 మంది విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరైనట్లు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి తెలిపారు. విద్యార్థులకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను పరిశీలించామని తెలిపారు.

ఏఐఏవైఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రవి

దండేపల్లి, జూన్ 24: ఆల్ ఇండియా అంబెద్కర్ యువజన సంఘం ఏఐఏవైఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ధర్మరావుపేట గ్రామానికి చెందిన కొల్లూరి రవికుమార్ నియమితులయ్యారు. సోమవారం సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధుకు నియామక పత్రాన్ని అందజేశారు. రవికుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ పదవి ఇచ్చినందుకు రాష్ట్ర, జిల్లా కమిటీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

సింగరేణి ఆసుపత్రిలో స్పెషలిస్టు వైద్యులను నియమించాలి

బెల్లంపల్లి, జూన్ 24 : పట్టణంలోని సింగరేణి ఏరియా ఆసుపత్రిలో స్పెషలిస్టు వైద్యులను నియమించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిట్టపల్లి వెంకటస్వామి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసుపత్రిలో సరైన వైద్యులు లేక ఇక్కడ కార్మికులను ఇతర ప్రాంతాల్లోని ఆసుపత్రికి రెఫర్ చేస్తున్నారన్నారు. మందమర్రి ఏరియా కార్మికులు బెల్లంపల్లి పట్టణంలో వేల మంది ఉన్నారని, వారికి సింగరేణి ఏరియా ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందించాలన్నారు. స్పెషలిస్టు వైద్యులను నియమించి అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచాలన్నారు. ఆసుపత్రిలో 30 మంది స్టాఫ్ నర్సులు, 30 మంది వార్డుబాయ్‌లు, 20 మంది స్కావెంజర్లను, ఐదుగురు ల్యాబ్ టెక్నిషియన్‌లను, 8 మంది క్లర్కులను తక్షణమే నియమించాలని కోరారు.

నోటు పుస్తకాల పంపిణీ

మందమర్రిరూరల్, జూన్ 24 : మందమర్రి వాసవీ వనిత క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సోమవారం నోటుపుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షురాలు గడ్డం సరిత మాట్లాడుతూ యేటా విద్యార్థులకు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. మాలతి, అరుణ, శైలజ, లహరిక, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్‌కు సన్మానం



మందమర్రిరూరల్, జూన్ 24: మంచిర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా మందమర్రి మండలం చిర్రకుంట గ్రామానికి చెందిన సిద్దం జనార్దన్ ప్రమాణ స్వీకారం చేశారు. 25 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేశారు. కాంగ్రెస్ నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. నీలయ్య, కమల్ మనోహర్‌రావు, రాయమల్లు తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ టాయిలెట్‌ల కోసం భూమి కేటాయింపు

భీమారం, జూన్ 24 : మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో పబ్లిక్ టాయిలెట్ల కోసం మండల సర్వేయర్ నాగరాజు సోమవారం సర్వే చేసి భూమిని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌కు కేటాయించారు. త్వరలోనే టాయిలెట్ల నిర్మాణ పనులను చేపడతామని కార్యదర్శి పేర్కొన్నారు. మండల నాయకులు పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణం త్వరగా చేపట్టాలని కార్యదర్శికి వినతి పత్రం అందించారు. మోహన్‌రెడ్డి, అరుణ్‌కుమార్, రాంరెడ్డి, నాగరాజు, శ్రీనివాస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత పుస్తకాల పంపిణీ

రామకృష్ణాపూర్, జూన్ 24: రామకృష్ణాపూర్ పోలీస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం అసోసియేషన్ అధ్యక్షుడు శేఖర్‌బాబు ఉచితంగా పుస్తకాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ అసోసియేషన్ ఏర్పడి ఏడు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా బుక్స్, స్టేషనరీ అందజేశామన్నారు. మంచి నీటి సమస్య పరిష్కారానికి వాటర్ ప్యూరిఫయర్ అందజేస్తామని హెచ్‌ఎం అనురాధకు హామీ ఇచ్చారు. సప్ప శ్రీనివాస్, రాజ్‌కుమార్, రాజు, సతీష్, రాం, శ్రీధర్, పాల్గొన్నారు.

అనారోగ్యంతో అయిదేళ్ల చిన్నారి మృతి

- వైద్యం వికటించే మృతి చెందిందని బంధువుల ఆరోపణ
- ఆసుపత్రి ఎదుట ఆందోళన

ఆసిఫాబాద్, జూన్ 24: ఆసిఫాబాద్ జిల్లాకేంద్రంలోని జన్కాపూర్ కాలనీకి చెందిన ఇగురపు లోహిత (5) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... జన్కాపూర్ కాలనీకి చెందిన ఇగురపు హరీష్ చిన్నకూతురు లోహిత ఆదివారం రాత్రి వాంతులతో బాధపడుతుండగా పట్టణంలోని కోర్టుచౌరస్తా సమీపంలోని ఓ పిల్లల ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు చికిత్స నిర్వహించారు. కొద్దిసేపటి తరువాత చిన్నారి ఆరోగ్యం విషమంగా మారింది. దీంతో హుటాహుటిన చిన్నారిని కాగజ్‌నగర్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే లోహిత మృతిచెందిందని అక్కడి వైద్యులు నిర్ధారించారు. దీంతో కుటుంబ సభ్యులు లోహిత మృతదేహాన్ని ఆసిఫాబాద్‌లో మొదట చూపించిన పిల్లల ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. ఆసుపత్రిలో చేసిన వైద్యం వికటించడంతోనే చిన్నారి మృతిచెందిందని ఆరోపించారు. కుటుంబ సభ్యులకు ఆసుపత్రి వైద్యులకు మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ విషయాన్ని తెలుసుకున్న పోలీసులు ఆసుపత్రికి వచ్చి ఆందోళ నకారులకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. అర్ధరాత్రి వరకు ఆసుపత్రి ఎదుట కుటుంబసభ్యులు ఆందోళన చేశారు. చివరికి ఆసుపత్రి యజమాన్యం బాధిత కుటుంబానికి నష్టపరిహారం చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



లోహిత మృతదేహం



ఆసుప్రతి ఎదుట ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు

ఆసుపత్రి వైద్యులపై చర్యలు తీసుకోవాలి..

చిన్నారి లోహిత మృతికి కారకులైన ఆసిఫాబాద్ పట్టణంలోని ఆసుపత్రి వైద్యులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రేగుంట కేశవరావు డిమాండ్ చేశారు. సోమవారం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతులు లేకుండా ప్రైవేటు ఆసుపత్రుల నిర్వహణ, అర్హతలేని వైద్యులు వైద్యం చేస్తున్నారని ఆరోపించారు. వైద్యం వికటించడంతోనే చిన్నారి మృతిచెందిందని, విచారణ జరిపి సంబంధిత వైద్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

‘సన్నాల’ సాగుకే రెబ్బెన రైతుల మొగ్గు

- క్వింటాలుకు రూ.500బోనస్
- సాగుకు సమాయత్తమవుతున్న అన్నదాతలు

రెబ్బెన, జూన్ 24: వానాకాలం పంటల సాగులో మండలంలోని వరి రైతులు సన్నాలకే ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటివరకు వానాకాలం సీజన్‌లో దాదాపు 80 శాతం సన్నాలు 20 శాతం దొడ్డురకం వరిని సాగు చేశారు. యాసంగిలో మాత్రం దాదాపు 70 శాతం మంది రైతులు దొడ్డు రకం సాగు చేస్తుండగా మిగిలిన రైతులు వివిధ కారణాలతో సన్నాలు సాగు చేస్తున్నారు. ఈ సారి వానాకాలంలో రైతులంతా సన్నాలకే ప్రాధాన్యత ఇస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వానాకాలం సీజన్ నుంచి సన్నాలకు బోనస్ ప్రకటించటంతోపాటు దొడ్డురకం వరి ధాన్యం అమ్మకాల్లో ఏర్పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని రైతులు సన్నాలవైపు అడుగులు వేస్తున్నట్టు తెలుస్తోంది. మండలంలోని రైతులు వానాకాలంలో సుమారు 6200 ఎకరాల వరకు వరి ని సాగుచేస్తున్నారు. ప్రధాన సాగునీటి వనరు వట్టివాగు ప్రాజెక్టు కాల్వల నిర్వహణ సరిగా లేకపోవటంతో ఆయకట్టు కింద వరిసాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయింది. అందుబాటులో ఉన్న బోరుమోటార్లు, కుంటలు, వాగులపై ఆధారపడి సాగు నీటిని పంటలకు అందిస్తున్నారు.

అయితే గతంలో పోల్చితే ఈసారి సాగు పరిస్థితి మారేలా కన్పిస్తోంది. వానాకాలం సీజన్‌లో పంటలకు సంవృద్ధిగా సాగునీరు అందే అవకాశం ఉండటంతో రైతులు సన్నాలకు సాగుకు ప్రాధాన్యత ఇస్తున్నారు. యాసంగిలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా పంటలకు సరిగా నీరు అందక తప్పాతాలు పెరిగే అవకాశం ఉండటంతో దొడ్డు రకం వరిసాగు చేస్తున్నారు.

దిగుబడి తక్కువ..: వి మురళి, రెబ్బెన



దొడ్డురకం వరి సాగుతో పోలిస్తే సన్న రకం సాగులో దిగుబడి తక్కువగా ఉంటుంది. దానికి తోడు తెగుళ్ల బెడద అధికంగా ఉంటుంది. పెట్టుబడి ఖర్చులు కూడా అధికంగానే ఉంటున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం వానాకాలం సీజన్ నుంచి సన్నరకం పంటకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పటం హర్షణీయం. రైతులకు ఉపయోగపడుతుంది. కాస్త ఊరట లభించినట్లయింది.

గిట్టుబాటు ధర కల్పించాలి.. సునీల్‌చౌదరి, దేవులగూడా



వరిసాగులో పెట్టుబడులు భారీగా పెరిగాయి. పెరిగిన ఖర్చులకు అనుగుణంగా ప్రభుత్వం మద్దతు ధర ప్రకటిస్తేరైతులకు మేలు జరుగుతుంది. అరకొరగా మద్దతుధర పెంచుతోంది. రైతులకు గిట్టుబాటు అయ్యేలా ధరను పెంచాల్సి ఉంటుంది. ప్రభుత్వం తప్పకుండా మద్దతు ధరపై నిర్ణయం తీసుకుంటే బాగుంటుంది. బోనస్‌తో రైతులకు ఊరట లభిస్తోంది. మద్దతు ధర కూడా ఉండాలి.

మహిళల భద్రతే షీటీం లక్ష్యం

కెరమెరి, జూన్ 24: మహిళల భద్రతే షీ టీం లక్ష్యమని షీటీం ఇన్‌చార్జి సునీత అన్నారు. సోమవారం మండలంలోని గోయగాం జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో షీటీంసేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడతూ సైబర్‌నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని, అపరిచిత వ్యక్తులతో ఫోన్‌కాల్స్, వాట్సాప్‌కాల్ గాని మాట్లడవద్దని అన్నారు. అపరిచితవ్యక్తులు కానీ, అపరిచితగ్రూపుల నుంచి వచ్చిన మెస్సెజ్‌లను ఓపెన్‌చేయవద్దన్నారు.ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు వెంటనే 1930 టోల్‌ఫ్రీ నెంబర్‌కు కాల్‌చేసి సమస్యను పరిష్కరించుకోవాలన్నారు.అలాగే ఆపదసమయంలో 100, షీటీంనంబరు 8712670564 సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు సునీత, శ్రీలత, మురహరి, జంగు పాల్గొన్నారు.

ప్రైవేటు ఆసుపత్రుల తనిఖీ



ఆసుపత్రులను తనిఖీచేస్తున్న డాక్టర్ సిద్దార్థ

ఆసిఫాబాద్ రూరల్, జూన్ 24: ఆసిఫాబాద్ మండలంలోని పలు ప్రైవేటు ఆసుపత్రులను సోమవారం సీఈఏ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సిద్దార్థ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి సీఈఏ ప్రకారం ఆసుపత్రులను నడపాలని సూచించారు. డయాగ్నోస్టిక్ సెంటర్‌లను తనిఖీ చేసి సరైన విద్యార్హత ఉన్న వారితో మాత్రమే ల్యాబ్‌లో పరీక్షలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డెమో నాగలక్ష్మి, ఆపరేటర్ శివ పాల్గొన్నారు.

ఆరుగురిపై అట్రాసిటీ కేసు నమోదు

చింతలమానేపల్లి, జూన్ 24: మండలంలోని రుద్రాపూర్ గ్రామానికి చెందిన కవ్వాల సాగర్, కవ్వాల సందీప్, కవ్వాల వినోద్, కుదురుపాక తిరుపతి, లెండుగురే సంఘ్‌దేవ్ గంగాపూర్ గ్రామానికి చెందిన డోకే శీనుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. మండలంలోని రుద్రాపూర్ గ్రామసమీపంలో గల వాగులో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని ఆ గ్రామానికి చెందిన దుర్గం సుగుణాకర్, మోర్లె బాపురావు, పెరుగు లక్ష్మణ్, కొట్రంగి శ్రీనివాస్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు ఇసుక అక్రమ తరలిస్తున్న ప్రదేశానికి వెళ్లగా అప్పటికే డోకే శ్రీను, కవ్వాల సాగర్,కవ్వాల సందీప్, కవ్వాల వినోద్, కుదురుపాక తిరుపతి, లెండుగురె సంగ్‌దేవ్ కులం పేరుతో దూషిస్తూ దుర్గం సుగుణాకర్, మోర్లె బాపురావు, పెరుగు లక్ష్మణ్, కొట్రంగి శ్రీనివాస్‌పై దాడి చేశారు. దీంతో బాధితుల ఫిర్యాదు మేరకు ఆరుగురిపై అట్రాసిటీ కేసునమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎరువుల దుకాణం తనిఖీ

చింతలమానేపల్లి, జూన్ 24: మండలంలోని గూడెంలోని పలు ఎరువుల దుకాణాలను సోమవారం వ్యవసాయాధికారి రామకృష్ణ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని, ఎవరైనా ఎరువులను మహారాష్ట్రకు తరలిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గూడెం అంతరాష్ట్ర బ్రిడ్జివద్ద వాహనాలను తనిఖీచేశారు.

అందవెల్లి బ్రిడ్జిని పరిశీలించిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



కాగజ్‌నగర్‌లో రైతులతో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కాగజ్‌నగర్, జూన్ 24: కొట్టుకుపోయిన అందవెల్లి బ్రిడ్జి తాత్కాలిక రోడ్డును సోమవారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు. అనంతరం రైతులతో కాసేపు మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే హరీష్‌బాబు నిధులకోసం అందవెల్లి బ్రిడ్జి వద్ద దీక్షచేస్తే రావన్నారు. హైదరాబాద్‌లో పోరాటాలు చేయాలన్నారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్న సమయంలో రోడ్లపై వరినాట్లు వేసిన డాక్టర్ హరీష్‌బాబు, తనను గెల్పిస్తే అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. ఇప్పుడు దీక్షల పేరిట కాలయాపన తప్ప ఏమీరాదన్నారు. ఆయనవెంట బీఆర్ ఎస్ నాయకుడు అవులరాజ్‌కుమార్, మాజీ సర్పంచి ఉమ,పర్వతి అంజన్న, రాందాస్, చిలుక శేఖర్, రంజిత్, ముంజం లింగయ్య తదితరులున్నారు.

ప్రజాసమస్యలపై పోరాటం చేస్తాం

బెజ్జూరు: ప్రజాసమస్యలపై పోరాటం చేస్తామని రాష్ట్ర బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బెజ్జూరు మండలంలోని సోమిని, బెజ్జూరు, సలుగుపల్లి, సులుగుపల్లి, మర్థిడి తదితర గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించారు. మర్థిడి గ్రామంలో పోడు భూముల సమస్య పరిష్కారం, నకిలీవిత్తనాలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాగజ్‌నగర్ మండలం అందవెల్లి పెద్దవాగుపై ఏటా రూ.50 లక్షలకు పైగా ఖర్చు వృథా అవుతోందన్నారు. దహెగాం, కాగజ్‌నగర్ మండలాల ప్రజలకు, విద్యార్థులకు, రైతులకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. వంతెన అప్రోచ్‌పనులు ఆదరబాదరగావేసి పనులు నాసిరకంగా చేస్తున్నారని ఆరోపించారు. సిర్పూర్ ఎమ్మెల్యేకు నిదులు రాబట్టడం చేతకాకపోతే పదవికి రాజీనామా చేయాలన్నారు. కాంగ్రెస్‌సర్కార్ పూర్తిగా విఫల మైందన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయన్నారు. ఇటీవల దహెగాంకు చెందిన ఓ చిన్నారిపై అత్యాచారం, హత్య జరిగినప్పటికీ సత్వరమే ఫాస్ట్‌ట్రాక్ కేసునమోదు చేసి నిందితుడికి ఉరిశిక్షపడేలా చర్యలు తీసుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలో హోంశాఖ మంత్రి పదవిని కూడా కేటాయించలేకపోయిన సీఎం రేవంత్‌రెడ్డి సత్వరమే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో చిన్నయ్య, రాంప్రసాద్, రాజ్‌కుమార్, షాకీర్, సారయ్య, విజయనిర్మల, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్, జూన్ 24: ఆసిఫాబాద్ పట్టణంలోని షెడ్యూల్ కులాల అభివృద్ధిశాఖకు చెందిన బాలుర వసతి గృహం, కళాశాల వసతిగృహంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి సజీవన్ ఒక ప్రకటనలో కోరారు. ప్రిమెట్రిక్ వసతిగృహంలో 40సీట్లు, పోస్ట్‌మెట్రిక్ వసతిగృహంలో 86సీట్లు ఉన్నాయని అర్హతగల విద్యార్థులు దరఖాస్తుచేసుకోవాలన్నారు. మిగితా వివరాలకు 9441170044 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు..

వాంకిడి: వాంకిడి కస్తూర్బా కళాశాలలో ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు స్పెషల్ ఆఫీసర్ రైసాఖాతూన్ తెలిపారు. సీఈసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులలో సీట్లు ఖాళీగా ఉన్నాయని ఆసక్తిగల విద్యార్థులు కళాశాలలో సంప్రదించాలన్నారు.

జిల్లాలో 14.8మిల్లీమీటర్ల వర్షపాతం

ఆసిఫాబాద్, జూన్ 24: జిల్లాలో సోమవారం 14.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. జిల్లాలోని ఆయా మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. లింగాపూర్ మండలంలో అత్యధికంగా 53.4మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా సిర్పూర్(టి)మండలంలో 0.4మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది.

రేపు వారసంత వేలం

రెబ్బెన, జూన్ 24: రెబ్బెన మండలం గోలేటిటౌన్ షిప్‌లో ప్రతి గురువారం జరిగే వారసంత ఈనెల 26న ఉదయం 10గంటలకు గ్రామపంచాయతీ కార్యాలయంలో వేలం వేస్తామని పంచాయతీ కార్యదర్శి జలందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

రాణి దుర్గావతికి నివాళులు

జైనూర్, జూన్ 24: మండల కేంద్రంలోని దుబ్బగూడ చౌరస్తాలో సోమవారం ఆదివాసుల ఆరాధ్య దైవం, వీరనారి రాణి దుర్గావతి వర్ధంతిని ఆదివాసులు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా నాయకులు రాణి దుర్గావతి విగ్రాహనికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సహకార కమిటీ చైర్మన్ కొడప హన్నుపటేల్ మాట్లాడుతూ ఆదివాసులను చైతన్యపర్చడం, హక్కులను సాధించడంలో రాణి దుర్గావతి కీలకపాత్ర పోషించందన్నారు. కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ చైర్మన్ కనక యాదవ్‌రావ్, మడావి మనోహర్, తాజామాజీ సర్పంచులు మడావి భీంరావ్, మేస్రాం రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తరలిస్తున్న లారీలు పట్టివేత



పట్టుకున్న ఇసుక లారీలతో సీఐ, పోలీసులు

జైనూర్, జూన్24: ఆసిఫాబాద్ వైపు నుంచి జైనూరు మీదుగా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు లారీలను పట్టుకుని సీజ్ చేసినట్లు సీఐ అంజయ్య తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సోమవారం తెల్లవారు జామున ఆసిఫాబాద్ నుంచి వస్తున్న ఇసుకలారీలను పట్టు కున్నామని తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అంకితభావం.. ఆదర్శం..

- ప్రైవేట్‌కు దీటుగా వాంకిడి ప్రభుత్వ కళాశాల
- వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా బోధన
- ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ, ప్రత్యేక తరగతులు

వాంకిడి, జూన్ 24: ప్రభుత్వ కళాశాలలంటే అందరికీ చిన్నచూపే... అక్కడ వసతులుండవని, విద్యాబోధనలు సరిగా జరగవని ప్రజల్లో అపనమ్మకం. ప్రజల్లో ఉన్న అపనమ్మకాన్ని వమ్ము చేస్తూ సమష్టి కృషి, క్రమశిక్షణ, ఉత్తమ ఫలితాలు సాధిస్తూ ప్రైవేటుకు దీటుగా ప్రతి ఏటా మెరుగైన ఫలితాలు సాధిస్తూ వాంకిడి ప్రభుత్వ కళాశాల ఆదర్శంగా నిలుస్తోంది. ధనిక, పేదఅనేబేధం లేకుండా ఏకరూప దుస్తులను కళాశాలలో అమలు చేస్తూ అధ్యాపకుల కృషితో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు.



కళాశాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు

వాంకిడి మండల కేంద్రంలో 2001లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రారంభమైంది. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులు నిర్వహిస్తున్నారు. రెగ్యులర్ ప్రిన్సిపాల్‌తోపాటు అన్ని సబ్జెక్టులకు అధ్యాపకులు పనిచేస్తున్నారు. విద్యార్థులపై ప్రత్యేక దృష్టిపెడుతూ వారు గైర్హాజరు కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. విద్యార్థుల్లో ధనిక, పేద అనే తేడా లేకుండా ఉండాలనే ఉద్దేశంతో ఏకరూప దుస్తులను అమలు చేస్తున్నారు. ప్రతిరోజు ఉదయం ఏకరూప దుస్తులు ధరించి విద్యార్థులు ప్రార్థన నిర్వహిస్తారు. ప్రతిరోజు ప్రత్యేకతరగతులు నిర్వహిస్తూ అధ్యాపకుల కృషితో విద్యార్థులు ఉత్తమఫలితాలు సాధిస్తూ ఇతర కళాశాలలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఏడుసంవత్సరాలుగా 98నుంచి వందశాతం ఉత్తీర్ణత సాధిస్తూ కళాశాల పేరును నిలబెడుతున్నారు. రెండు సంవత్సరాలుగా ఈకళాశాల నుంచి జిల్లాటాపర్లుగా విద్యార్థులు నిలవడమే కాకుండా ఈ ఏడాది జేఈఈ మెయిన్స్ అడ్వాన్స్‌లో దుర్గం అర్జున్ అనే యువకుడు ర్యాంక్ సాధించి కళాశాల పేరుప్రతిష్ట జిల్లా స్థాయిలో నిలబెట్టాడు.

ఐదేళ్లుగా సాధించిన ఫలితాలు

సంవత్సరం	ఉత్తీర్ణత శాతం
2018-19	100
2019-20	100
2020-21	100
2021-22	98
2022-23	95
2023-24	97



వాంకిడి ప్రభుత్వ కళాశాల

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతారు..

- దుర్గం అర్జున్- జేఈఈ మెయిన్స్ ర్యాంకర్



కళాశాల ప్రిన్సిపాల్‌తోపాటు అధ్యాపకులు తరగతుల నిర్వహిణలో ఎక్కడ రాజీపడకుండా మెరుగైన బోధన అంది స్తారు. సకాలంలో సిలబస్ పూర్తిచేసి పునశ్చరణ తరగతులను నిర్వహిస్తారు. ప్రతిరోజు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారు. అధ్యాపకుల కృషి ఫలితంగానే వందశాతం ఉత్తీర్ణత సాధించాం. నేను ఎంపీసీలో 961మార్కులు సాధించి జేఈఈ మెయిన్స్‌లో ర్యాంక్ సాధించాను

అధ్యాపకుల సమష్టి కృషితోనే ఫలితాలు

- సంపత్‌కుమార్, ప్రిన్సిపాల్



అధ్యాపకుల కృషితోనే ఉత్తమఫలితాలు సాధిస్తున్నాం. ఎక్కడా రాజీపడకుండా ఆరు సంవ్సతరాలుగా నాణ్యమైన విద్యాబోధన చేస్తూ విద్యార్థులను ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేస్తున్నాం. ప్రత్యేక తరగతులు, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. అధ్యాపకుల కృషికి తోడు విద్యార్థులు కూడా వందశాతం ఉత్తీర్ణత సాధించి కళాశాల పేరును నిలబెడుతున్నారు. విద్యార్థులు ప్రైవేట్ కళాశాలలవైపు వెళ్లకుండా శిక్షణ పొందిన అధ్యా పకులున్న ప్రభుత్వ కళాశాలల్లో చదువుకోవాలి.

అందవెల్లి బ్రిడ్జిని పూర్తిచేయాలని ఎమ్మెల్యే దీక్ష

- స్పందించిన కలెక్టర్
- బ్రిడ్జి పైనుంచి ప్రారంభమైన రాకపోకలు



వంతెనపై నుంచి ఆటోలో ప్రయాణిస్తున్న సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్‌పాల్వాయి హరీష్‌బాబు

కాగజ్‌నగర్, జూన్ 24: కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం అందవెల్లి బ్రిడ్జి పనులు పూర్తిచేయాలని కోరుతూ సోమవారం సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ హరీష్‌బాబు నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాగజ్‌నగర్ అందవెల్లి బ్రిడ్జి తాత్కాలిక రోడ్డు వరద తీవ్రతకు కొట్టుకపోవటంతో దహెగాం, భీమిని మండలాలకు చెందిన 54గ్రామాలకు రవాణా వ్యవస్థ స్తంభించినట్టు తెలిపారు. వర్షాకాలం వస్తే సమస్యలు వస్తాయని మంత్రి సీతక్క దృష్టికి తీసుకుపోయినప్పటికీ ఇంత వరకు పట్టించుకోలేదన్నారు.

రాకపోకలు పునరుద్దరించిన అధికారులు..

కాగజ్‌నగర్ అందవెల్లి బ్రిడ్జిపై నుంచి సోమవారం రాకపోకలు పునరుద్ధరించారు. మధ్యాహ్నం నుంచి అప్రోచ్‌రోడ్డు పనులు ప్రారంభించి మట్టిని లెవల్ చేసి వాహనాలు పోయేందుకు వీలుగా చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హరీష్‌బాబు ఆటోలో స్వయంగా ప్రయాణించారు. సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ హరీష్‌బాబు మాట్లాడుతూ ఇది ప్రజల విజయమన్నారు. స్పందించిన జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఇతర అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఒక్క రోజులోనే అధికారులు స్పందించి బ్రిడ్జిపై నుంచి రాకపోకలు పునరుద్దరించిన అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొంగ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

ఆసిఫాబాద్, జూన్ 24: ఇంటర్ అడ్వాన్సుసప్లిమెంటరీ ఫలితాలను ప్రభుత్వం సోమవారం విడుదల చేసింది. జిల్లాలో ఇంటర్ ప్రథమ సంవత్సరం జనరల్ విభాగంలో 738మందివిద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 1109 విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి తెలిపారు. అలాగే ప్రథమ సంవత్సరం ఒకేషనల్ విభాగంలో 201మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 128మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ద్వితీయ సంవత్సరం జనరల్‌లో 1028 మందికి 699 మంది ఉత్తీర్ణత సాధించారని, ఒకేషనల్‌లో 120 మందికి 76 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

ఇంప్రూవ్‌మెంట్‌లో మోడల్‌కళాశాల విద్యార్థులకు రాష్ట్రస్థాయి ర్యాంకులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ఆసిఫాబాద్ రూరల్, జూన్ 24: జిల్లా కేంద్రంలోని మోడల్ కళాశాల విద్యార్థులు ఇంప్రూమెంట్‌లో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించనట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. సోమవారం విడుదలైన ఫలితాల్లో కళాశాలకు చెందిన విద్యార్థులు ఆదీబా తెహ్రీమ్ 470/466) మార్కులో రాష్ట్రస్థాయిలో 4వర్యాంకు, ఎం శ్రీహర్షిత(470/461)మార్కులతో రాష్ట్రస్థాయిలో 8వర్యాంకు, దుర్గం విద్య(440/430) రాష్ట్రస్థాయిలో 9వర్యాంకు సాధించినట్లు తెలిపారు. అలాగే సమత(470/456), అల్లె శ్రావణి(440/425), ముత్యం సాత్విక(500/458), సాహిత్య(500/457) మార్కులు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులకు ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

రైతులు సేంద్రియ ఎరువులనే వాడాలి: డీపీవో

కౌటాల, జూన్ 24: రైతులు సేంద్రియ ఎరువులు వాడడం వల్ల పంట దిగుబడి పెరుగుతుందని జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతిగౌడ్ అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఏర్పాటుచేసిన పంటసిరి(సేంద్రియ ఎరువు) విక్రయకేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు తప్పకుండా సేంద్రియ ఎరువులను వాడాలన్నారు. మండలంలోని పంచాయతీ సిబ్బందిచెత్తను వృథా చేయకుండా సేంద్రియ ఎరువును తయారు చేయడం అభినందనీయమన్నారు. దీంతో పంచాయతీలకు ఆదాయం పెరగడంతోపాటు రైతులకు తక్కువ ఖర్చుకు ఎరువులను అందించడం జరుగుతుందన్నారు. మండలంలో సోమవారం 20పంచాయతీల్లో 1730కిలోల సేంద్రియ ఎరువుల విక్రయించడం ద్వారా 51,900 నగదు వచ్చినట్లు ఎంపీడీవో నస్రుల్లాఖాన్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ విశ్వనాథ్, జడ్పీటీసీ అనూష, వైస్ ఎంపీపీ అమ్మక్క, ఎంపీటీసీలు మోతీరాం, శిరీష, ఎంపీవో మహేందర్‌రెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు కొబ్బరి సాగుపై అవగాహన సదస్సు

పెంచికలపేట, జూన్ 24: మండలకేంద్రంలోని రైతువేదికలో మంగళవారం కొబ్బరిసాగుపై అవగాహనసదస్సు నిర్వహిస్తున్నట్లు ఏవో రాజుల నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. కొబ్బరిసాగుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న పథకాలు, రాయితీ, సాగువిధానం గురించి సంబంధిత శాస్త్రవేత్తలతో రైతులకు అవగాహన కల్పిస్తామని రైతులు పాల్గొనిసందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు.

రైల్వేగేటు రెండు రోజులు మూసివేత

రెబ్బెన, జూన్ 24: మండలంలోని గంగాపూర్ రైల్వే గేటు(నెం.71)ను రెండ్రోజులపాటు మూసివేస్తున్నట్టు రైల్వేశాఖ అధికారులు తెలిపారు. 3వరైల్వేలైన్ నిర్మాణ పనులు నడుస్తున్నందున ఈనెల25, 26తేదీల్లో ఆసిఫాబాద్-రేపల్లేవాడ స్టేషన్‌మధ్యలో ఉన్నగేటు నెం.71 మూసివేస్తున్నట్టు ప్రకటించారు. ప్రయాణికులు గమనించాలని కోరారు.

ప్రజాసమస్యల సత్వర పరిష్కారానికి కృషి: కలెక్టర్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, జూన్ 24: ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలనుంచి వచ్చిన సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరష్కారమయ్యే విధంగా కృషి చేస్తామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపుకలెక్టర్ దీపక్ తివారి, దాసరి వేణు, ఆర్‌డీవోలు లోకేశ్వర్, సురేష్‌తో కలిసి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి జిల్లా అధికారులు ఖచ్చి తంగా హాజరుకావాలన్నారు. రాని వారికి షోకాజు నోటీసులు అందజేయాలని ఆదేశించారు. శాఖలవారీగా స్వీకరించిన ఫిర్యాదులను పరిశీలించి పెండింగ్‌లో ఉన్న అర్జీదారుల దరఖాస్తులను వచ్చేవారంలోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అనంతరం ప్రజావాణిలో ప్రజలనుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఆసిఫాబాద్ మండలం జన్కాపూర్ గ్రామానికి చెందిన లలిత దివ్యాంగ పెన్షన్ కొరకు దరఖాస్తు చేశారు. రెబ్బెన మండలానికి చెందిన ప్రశాంత్‌గౌడ్ సబ్సిడీ డబ్బుల మంజూరు కోసం, సిర్పూర్(టి) మండలం డోర్‌పల్లికి చెందిన కమల్నాథ్ తన భూమిని ఇతరులు పట్టా చేసుకున్నందున విచారణజరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. కెరమెరి మండలం దనోర గ్రామానికి చెందిన విఠల్ వృద్ధాప్య పెన్షన్ కోసం, సిర్పూర్(టి) మండలం పారిగాంగ్రామానికి చెందిన హరీష్‌కుమార్ సాంఘిక సంక్షేమగురుకులపాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశం కొరకు దరఖాస్తు చేసుకున్నారు. ఆసిఫాబాద్ మండలం వాడిగూడ గ్రామానికి చెందిన రాజ్యలక్ష్మి ఆయాపోస్టు ఇప్పించాలని దరఖాస్తు చేసుకున్నారు. బెజ్జూరు మండలం పోతెపల్లి గ్రామానికి చెందిన చిన్నయ తనభూమి ప్రాణహిత చేవెళ్ల కాలువలో ముంపునకు గురైందని నష్ట పరిహారం ఇప్పించాలని దరఖాస్తు చేసుకోగా తిర్యాణి మండలం మాణిక్యాపూర్‌కు చెందిన సూరు తన భూమిని కొలతలు చేయడానికి దరఖాస్తు అందజేశారు.

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఈనెల26న ప్రపంచ మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవం నిర్వహణ సందర్భంగా ఏర్పాటు చేసిన సమీక్షాసమావేశంలో ఆయన పాల్గొని మాటాడారు. మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు ప్రతిఒక్కరూ సమష్టిగా కృషిచేయాలన్నారు. మాదక ద్రవ్యాల వినియోగంవల్ల ఆరోగ్యాన్ని కోల్పోవడమే కాకుండా కుటుంబమంతా ఆర్థికంగా నష్టపోతారన్నారు. విద్యార్థులు, యువత చెడువ్యసనాలకు అలవాటు పడకుండా అధికారులు అవగాహన కల్పించి తగుచర్యలు తీసుకోవాలన్నారు. ప్రపంచ మాదకద్రవ్య నివారణ దినోత్సవం రోజున కలెక్టరేట్‌లో విద్యార్థులు, యువకులు, స్వచ్ఛందసంస్థల సభ్యులు, అధికారులతో సమావేశం నిర్వహించి మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించాలని తెలిపారు. అలాగే మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగేనష్టాలపై పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన, పెయింటింగ్‌పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమశాఖాధికారి భాస్కర్,డీఎంహెచ్‌వో తుకారాం భట్, జిల్లా రిజనాభివృద్ధి అధికారి రమాదేవి, డీపీవో భిక్షపతి, డీఎస్పీ సదయ్య, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్నభోజన పథకం కార్మికుల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

ఆసిఫాబాద్, జూన్ 24: మధ్యాహ్న భోజన కార్మికులకు పదివేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం తక్షణమే మధ్యాహ్న భోజన కార్మికులకు పదివేల వేతనం ఇవ్వాలని, పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రాజేందర్,నగేష్, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఆసిఫాబాద్ రూరల్, జూన్ 24: విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఎస్ఎఫ్ఐ నాయకులు డీఈవో అశోక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ జిల్లాలో ప్రైవేటు విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సాయికృష్ణ, సతీష్, సాయికుమార్, జాఫర్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కాగజ్‌నగర్‌లో ట్రాఫిక్ సమస్య

- ఇబ్బందులు పడుతున్న పట్టణవాసులు
- పట్టించుకోని అధికారులు

కాగజ్‌నగర్, జూన్ 24: కాగజ్‌నగర్‌లో ట్రాఫిక్ సమస్యతో పట్టణవాసులు ఇబ్బందులుపడుతున్నారు. మార్కెట్ ఏరియా, అంబేద్కర్ చౌక్, పొట్టి శ్రీరాములు చౌక్, తిరందాజ్ ఏరియాల్లో గల్లీలు ఇరుకుగా ఉండ డమే ప్రధాన కారణంగా తెలుస్తోంది. ముఖ్యంగా ఆదివారం సంత సమయంలో సమస్య తీవ్రంగా ఉంటోంది. ఫాతీమాకాన్వెంటు పాఠశాలవద్ద ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఎన్టీఆర్ చౌరస్తా నుంచి రాజీవ్‌గాంధీ చౌరస్తా, గాంధీ చౌరస్తా నుంచి పొట్టి శ్రీరాములు చౌక్, రాజీవ్‌గాంధీ చౌరస్తా నుంచి కాపువాడ వరకు నిత్యం రోడ్లపై వాహనాలు నిలుపుతుండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కనీసం కాలినడకన కూడా వెళ్లలేని పరిస్థితి ఉంది. ఈ విషయంపై పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు సమర్పించినా కూడా పట్టించుకోవటం లేదని పట్టణ ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా మున్సిపల్, ట్రాఫిక్ అధికారులు స్పందించి పట్టణంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలని పట్టణ వాసులు డిమాండు చేస్తున్నారు.

కాగజ్‌నగర్‌లో కురిసిన వర్షం



కాగజ్‌నగర్ మెరాజ్ మసీదు వద్ద వంతెనపై ప్రమాదకరంగా ఏర్పడిన బురద

కాగజ్‌నగర్, జూన్ 24: కాగజ్‌నగర్ పట్టణంలో సోమవారం మధ్యాహ్నం అరగంటపాటు వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని అంతర్గత రోడ్లు బురదమయంగా మారాయి. స్థానిక మెరాజ్ మసీదు వద్ద వంతెనపై వేసిన మట్టి వర్షానికి ప్రమాదకరంగా మారింది. బురదఎక్కువ కావటంతో వాహనాదారులు ఇబ్బందులు పడుతున్నారు. పలువురు కింద పడ్డారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని అంతా కోరుతున్నారు.



ఆదాయపు పన్ను వివరాలు తెలపండి

శ్రీరాంపూర్, జూన్ 24 : సింగరేణి ఉద్యోగులు తమ ఆదాయపు పన్ను వివరాలను తెలపాలని సింగరేణి ఆదాయపుపన్ను అధికారులు పేర్కొన్నారు. సోమవారం శ్రీరాంపూర్ ఏరియా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇతరుల ప్రలోభాలు, ప్రభావాలకులోనై తప్పుడు వివరాలు సమర్పించవద్దన్నారు. చట్టరీత్యా శిక్షకు గురికావద్దని సూచించారు. సింగరేణి అద్దెవాహన యజమానుల బిల్లులనుంచి ఏప్రిల్-2024 నుంచి సీఎంపీఎఫ్‌పై 12శాతం, సీపీఎంఎస్ నుంచి 7.5శాతం రికవరీ చేసి బిల్లులు ప్రాసెస్ చేయాలని డిజిఎం(పర్సనల్) పి. అరవిందరావుకు సూచించారు. సమావేశంలో డీవైపీఎంలు రాజేశ్వర్‌రావు, దేవేందర్ రెడ్డి, పాలకుర్తి రాజు, అన్ని గనుల సంక్షేమాధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి: జీఎం

మందమర్రిరూరల్(కాసిపేట), జూన్ 24: రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని మందమర్రి జీఎం మనోహర్ పేర్కొన్నారు. సోమవారం కాసిపేట 1వ గనిని సందర్శించారు. గనిప్లాన్‌ను పనిస్థలాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కార్మికులు రక్షణసూత్రాలు పాటిస్తూ బొగ్గుఉత్పత్తి చేయాలన్నారు. సమష్టికృషితో అంకితభావంతో పనిచేసి సంస్థ అభివృద్ధికి పాటుపడాలన్నారు. కార్మికుల సంక్షేమం కోసం యాజమాన్యం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో కేకే1 గ్రూపు ఏజెంటు రామదాసు, గని మేనేజర్ భూశంకరయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సెల్ టవర్ ఎక్కిన పవర్ ప్లాంట్ కార్మికుడు

జైపూర్, జూన్ 24: జైపూర్‌లోని ఎస్టీపీపీలో పవర్‌మేక్ కంపెనీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుడు మధు పీఎఫ్ డబ్బులు తనఖాతాలో జమకావడం లేదని పేర్కొంటూ సోమవారం పెగడపల్లి గ్రామంలోని సెల్‌టవర్ ఎక్కాడు. విషయం తెలుసుకున్న జైపూర్ రెండవ ఎస్ఐ నాగరాజు సంఘటన స్థలానికి చేరుకుని మధుతో మాట్లాడారు. పవర్‌మేక్ అధికారులు వచ్చి చెబితేనే సెల్‌టవర్ దిగుతానని తెలిపాడు. దీంతో ఎస్ఐ పవర్‌మేక్ హెచ్ఆర్ మధుకు సమాచారం అందించారు. హెచ్ఆర్ సెల్ టవర్ వద్దకు చేరుకుని కార్మికుడితో మాట్లాడారు. పీఎఫ్ డబ్బుల సమస్యను పరిష్కరిస్తానని హామీఇవ్వడంతో మధు సెల్‌టవర్ పైనుంచి కిందకుదిగాడు. దీంతో పోలీసులు, స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. అనంతరం మధును పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చి వదిలిపెట్టారు.

కైరిగూడ ఓపెన్ కాస్టు పరిశీలన

రెబ్బెన, జూన్ 24: కైరిగూడ ఓపెన్‌కాస్టును సోమవారం ఐఎన్‌టీయూసీ బెల్లంపల్లి ఏరియా వైస్‌ప్రెసిడెంట్ పేరం శ్రీనివాస్, సెంట్రల్ నాయకులు ప్రకాష్ రావు, సదాశివ, తదితరులు సందర్శించారు. ఈసందర్భంగావారు మాట్లాడుతూ ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ ఆదేశాలమేరకు ఓపెన్‌కాస్టును సందర్శించినట్లు తెలిపారు.

గ్రాట్యుటీపై సీలింగ్ ఎత్తివేయాలి: టీఎన్‌టీయూసీ

శ్రీరాంపూర్, జూన్ 24: సింగరేణి రిటైర్డ్ కార్మికులకు 10లక్షల రూపాయల వరకు గ్రాట్యుటీపై సీలింగ్ ఉందని దానిని ఎత్తివేసి 20లక్షల రూపాయల వరకు చెల్లించాలని టీఎన్‌టీయూసీ ప్రధానకార్యదర్శి ఠాకూర్ మణిరామ్‌సింగ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన యూనియన్ సభ్యులతోకలిసి రామగుండంలో ఉన్న సహాయకార్మికశాఖ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ, కోలిండియాలో గ్రాట్యుటీని 10నుంచి20లక్షల రూపాయల వరకు పెంచుతూ తేది: 28-03-2018న పార్లమెంట్‌లో ఆమోదం తెలిపారని, తేది: 01-01-2016 నుంచి అమలు చేసేందుకు నిర్ణయించారని తెలిపారు. అధికారులకు తేది: 01-01-2017 నుంచి అమలు చేసినా కార్మికులకు మాత్రం ఇవ్వలేదన్నారు. దీనివల్ల 3816 మంది రిటైర్డ్ కార్మికులకు అన్యాయం జరుగుతోందన్నారు. తమ యూనియన్ ఆధ్వర్యంలో సీఎండీలకు, ఇతరఅధికారులకు వినతిపత్రాలు ఇచ్చామన్నారు.అయినా స్పందన కానరావడం లేదని తెలిపారు. త్వరలో తాము అన్ని జీఎం ఆఫీస్‌లు, కొత్తగూడెం హెడ్‌ఆఫీస్ ఎదుట నిరాహారదీక్షలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షుడు గద్దల నారాయణ, నాయకులు డి చంద్రమౌళి, వి వెంకటస్వామి, పాషా, తదితరులు పాల్గొన్నారు.

హాజరు శాతాన్ని పెంచుకోవాలి

శ్రీరాంపూర్, జూన్ 24: సింగరేణిలో పనిచేస్తూ గైర్హాజరవుతున్న ఉద్యోగులు తమ హాజరుశాతాన్ని పెంచుకోవాలని ఇన్‌చార్జి జీఎం ఎం శ్రీనివాస్ అన్నారు. ఆర్కే.7, న్యూటెక్ గైర్హాజరీకార్మికులకు సోమవారం జీఎం కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనవసరంగా ఉపాధిని పోగొట్టుకొని కుటుంబాన్ని ఇబ్బందుల్లోకి నెట్టవద్దని సూచించారు. ఇప్పటికైనా సంస్థ కల్పిస్తున్న అవకాశాన్ని వినియోగించుకొని ప్రతి నెల కనీసం 20 మస్టర్ల చొప్పున చేయాలని ఆదేశించారు. కౌన్సెలింగ్‌కు 93మంది గైర్హాజరీ ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులతోకలిసి హాజరయ్యారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా, ఎస్‌ఓ టు జీఎం వి పురుషోత్తమ రెడ్డి పాల్గొన్నారు.

పాన్‌కార్డుతో అనుసంధానం చేసుకోండి

శ్రీరాంపూర్, జూన్ 24: సింగరేణి ఉద్యోగులు తమ పాన్‌కార్డులను ఆధార్‌కార్డుతో ఈనెల 30లోగా అనుసంధానం చేసుకోవాలని ఏఐటీయూసీ బ్రాంచ్‌కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా ఒక ప్రకటనలో తెలిపారు. అనుసంధానం లేనిపక్షంలో 20శాతం అనగా, రూ.1,50,000నుంచి రూ.2,00,000ల వరకు అపరాధ రుసుం వసూలు చేస్తారని పేర్కొన్నారు. అంతేకాకుండా భవిష్యత్తులో ఆదాయపు పన్ను రిటర్న్‌గాని, బ్యాంకు రుణంగాని, పాస్‌పోర్టుగాని తీసుకోవడానికి అనుమతించరని వివరించారు. వెంటనే కార్మికులు పాన్‌కార్డు, ఆధార్‌కార్డు అనుసంధానం చేసుకోవాలని కోరారు.

బొగ్గు బ్లాకులను వేలం వేయొద్దు

శ్రీరాంపూర్, జూన్ 24: సింగరేణికి చెందిన బొగ్గు బ్లాకులను వేలం వేయొద్దని ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు జె శంకర్‌రావు అన్నారు. నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి ఏరియాలో బొగ్గు బ్లాకులను గుర్తించిన యాజమాన్యం వాటితవ్వకాలు చేపట్టిందన్నారు. దానికోసం ఎంతో ఖర్చు చేసిందన్నారు. ఇప్పుడు వాటిని వేలం ద్వారా ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తే సింగరేణికి నష్టం జరుగుతుందని చెప్పారు. నామినేషన్ పద్ధతిలో సింగరేణికి కేటాయిస్తే ఎంతోమందికి ఉపాధి, యువతకు ఉద్యోగాలు లభిస్తాయన్నారు. దీనివల్ల నిరుద్యోగం తగ్గుతుందన్నారు. సింగరేణికి ఇవ్వకుండా వేలం వేయాలను కుంటే తమ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో యూనియన్ నాయకులు భీంరావు, పేరం రమేష్, కలవేన శ్యామ్, భీమ్ రవి పాల్గొన్నారు.

కారుణ్య నియామకాల్లో మొదటిస్థానం

శ్రీరాంపూర్, జూన్ 24: కారుణ్య నియామకాల్లో శ్రీరాంపూర్ ఏరియా మొదటి స్థానంలో ఉందని ఇన్‌చార్జి జీఎం ఎం శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఆయన 102మంది యువతీయువకులకు కారుణ్య నియామకపత్రాలు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని, లైట్ జాబ్ కోసం ప్రయత్నించవద్దని సూచించారు. గైర్హాజరైతే ఉద్యోగాలు కోల్పోయే అవకాశం ఉందని హెచ్చరించారు. ఇప్పటివరకు ఏరియాలో 3424మంది కారుణ్య విధానంలో ఉద్యోగాలు ఇచ్చినట్లు వివరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా, ఎస్‌వోటు జీఎం వి పురుషోత్తమరెడ్డి, డిజిఎం(పర్సనల్) పి అరవిందరావు పాల్గొన్నారు.